సిద్ధూ గడ్డపై అవినీతి

ముడాకు రూ.4 వేల కోట్ల నష్టం



- అడ్డగోలుగా ప్లాట్ల కేటాయింపులు
- సీఎం బంధువులకు అగ్ర తాంబూలం
- భూములిచ్చిన సామాన్యులకు అన్యాయం
- ముడా అధికారులను విచారించిన దర్యాప్తు బృందం

బెంగళూరు, ఆంధ్రజ్యోతి

సీఎం సిద్ధరామయ్య సొంతగడ్డపై రూ.4 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. మైసూరు నగర అభివృద్ధి ప్రాధికార (ముడా) అవినీతి వ్యవహారాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇంటి స్థలాలకోసం భూములు ఇచ్చేవారికి 50శాతం ప్లాట్‌లు, 50 శాతం నగదు పరిహారం ఇవ్వాలని తీర్మానించారు. 50:50 నిష్పత్తితో ఇన్సెంటివ్‌కు బదులుగా నివాస స్థలాన్ని పంపిణీ చేసే విషయంలో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. ముడా పరిధిలో 4,500 నుంచి 5000 ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. తద్వారా ముడాకు రూ.4వేల కోట్ల నష్టం జరిగింది. ఈ అవినీతి వెనుక కీలక నేతలు సూత్రధారులుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇంటి స్థలాలను పంపిణీ చేసే నిబంధనలను కాదని, మైసూరులోని విజయనగర, దట్టగళ్ళి, జేపీ నగర్, ఆర్‌టీ నగర్, హంచకా, సాతగళ్ళితోపాటు పలు లే అవుట్‌లలో ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. దీని గురించి కృష్ణరాజ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

అర్హులను కాదని...

మైసూరు తాలూకాలోని 86 సర్వే నంబరులో 7.03 ఎకరాల భూమి పరిహారం కోసం 81,670 చదరపు అడుగుల నివాస స్థలాన్ని పంపిణీ చేసే విషయంలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటిస్థలం కోసం 2023 అక్టోబరు 20న ఎం.శాంతమ్మ అనే మహిళ ముడాకు వినతి పత్రం ఇచ్చారు. ఆమె పేరిట అదే నెల 7న ఇంటి స్థలం మంజూరు కావడం వివాదానికి తెర లేపుతోంది. ముడా అధికారులు కనీస ఆలోచన లేకుండా స్థలాలు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. ముందుగా ప్లాట్‌లు కేటాయించి, ఆ తర్వాత దరఖాస్తులు స్వీకరించినట్లు కొన్ని ఆధారాలు లభించాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయాలనే నిబంధన పాటించలేదు. ముడా పాలక మండలి, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఒక్క ఇంటి స్థలాన్ని కూడా కమిషనర్ ఇవ్వడానికి వీలు లేదు. కానీ అనుమతులు లేకుండానే స్థలాలు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

అడ్డగోలుగా కేటాయింపులు

ప్రాధికారకు భూములు ఇచ్చినవారికి పరిహారం ఇచ్చేందుకు భారీగా లంచం అడిగినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల నుంచి కొత్త అర్జీలను స్వీకరించడం, వాటికంటే ముందుగానే ఇంటి స్థలాలు కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది. తక్కువ వ్యవధిలోనే వంశ వృక్షం, రికార్డులు అందించడం, అధికారులే హడావుడిగా స్థలాలు మంజూరు చేయడం, వేలాదిమంది పేరిట ఇంటి స్థలాలు అక్రమంగా కేటాయించడం వంటి వ్యవహారాలు జరిగినట్లు అనుమానులు వ్యక్తమౌతున్నాయి. సీఎం సిద్ధరామయ్య ఆప్తులకు సాధారణ స్థలంకంటే ఎక్కువ విస్తీర్ణం కేటాయించారు. హినకల్ సర్వే నెంబరు 211లో పాపణ్ణకు 30/40 కొలతలతో 36 ప్లాట్‌లను కేటాయించాల్సి ఉండగా, 60 ప్లాట్లను మంజూరు చేశారు. మైసూరు తాలూకా మారగౌడనహళ్ళిలో నాగరాజుకు 90 ప్లాట్‌లు ఇవ్వాల్సి ఉండగా 120 ప్లాట్లను కేటాయించారు. ఈ క్రమంలో సామాన్యులకు స్థలంలేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మైసూరు నగర పరిధిలో సొంతింటి స్థలం కోసం 85 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ముడాలో కొన్నేళ్లుగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

అక్రమాలపై విచారణ

ముడా పరిధిలో ఇంటి స్థలాల పంపిణీలో భారీగా అవినీతి చోటు చేసుకుందనే అంశం వెలుగులోకి రావడంతో గత గురువారం ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందం విచారణ జరిపింది. బెంగళూరు నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్ వెంకటాచలపతి, గ్రామీణ ప్లానింగ్ శాఖ డైరెక్టర్ ఎన్‌కే తిప్పేస్వామి, జాయింట్ డైరెక్టర్ ఎన్ గోపాలకృష్ణ సమగ్ర వివరాలు సేకరించారు. ముడా కమిషనర్ జీటీ దినేశ్‌కుమార్‌తోపాటు వివిధ విభాగాల అధికారులను ఏకంగా ఏడు గంటలపాటు విచారించారు. వివాదానికి సంబంధించి 140 ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముడా కార్యదర్శి, టౌన్ ప్లానింగ్ సభ్యులు, ఇంజనీర్‌లు, సూపరింటెండెంట్, భూస్వాధీన అధికారి, అకౌంటెంట్‌లను వారు విచారించారు.

యతీంద్ర సహకారంతోనే: బీజేపీ

ముడాలో రూ.5 వేల కోట్ల అవినీతి జరిగిందని, ఇందుకు సీఎం కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర సహకరించారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. ఈ అవినీతి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. దిశానిర్దేశం లేకుండా, చట్ట వ్యతిరేకంగా ఇంటి స్థలాలను ముడా అధికారులు కేటాయించారని కృష్ణరాజ ఎమ్మెల్యే శ్రీవత్స ఆరోపించారు. వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశామని తెలిపారు. అవినీతి సూత్రధారులు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. ముడా అక్రమాలపై పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు.

భారీ వర్షాలు... పొంగిన కృష్ణ



బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక తీర ప్రాంతాలు, మలెనాడులో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రానికి పైభాగాన ఉండే మహారాష్ట్రతోపాటు బెళగావి, పశ్చిమ కనుమల ప్రాంతంలో నిరంతరం వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో కృష్ణానది పొంగి పొర్లుతోంది. బెళగావి, మహారాష్ట్రలోని పశ్చిమకనుమలలో వర్షాల కారణంగా చిక్కోడి తాలూకా మాంజలి వద్ద కృష్ణానది నీటి ప్రవాహం రెండు అడుగులు పెరిగింది. దీంతో మాంజలి, భావన సవదత్తి మార్గం పూర్తిగా జలమయమైంది. బెళగావి సమీపంలోని మహారాష్ట్ర, చందగడ తాలూకా అంబోళి, బాబా జలపాతాలకు భారీగా నీరు చేరుతోంది. అటవీప్రాంతాలనుంచి నీటి ప్రవాహం రోజురోజుకూ పెరుగుతోంది. తీరప్రాంత జిల్లాలైన ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తరకన్నడ, శివమొగ్గ, కొడగు, చిక్కమగళూరు ప్రాంతాలలోనూ భారీగా వర్షం కురుస్తోంది.

వంద అడుగులకు చేరితేనే..

కాలువలకు నీటిపై మంత్రి చలువరాయస్వామి

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా ఉండే జలాశయాల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి తెలిపారు. మండ్యలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేఆర్‌ఎస్ జలాశయం నీటి నిల్వలు వంద అడుగుల నీరు చేరితే కాలువలకు మళ్లిస్తామని అన్నారు. ఇప్పుడే నీటి విడుదల చేయడం సాధ్యం కాదని అన్నారు. డ్యామ్‌లోకి దాదాపు 90 అడుగుల వరకూ నీరు చేరిందని అన్నారు. కేరళ రాష్ట్రంతోపాటు కావేరి పరిధిలో వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. గత ఏడాది తాగునీటికి ఇబ్బంది పడ్డామని, వర్షాలు మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నందున కేఆర్‌ఎస్‌కు పూర్తిగా నీరు చేరుతుందని భావిస్తున్నామని అన్నారు.

రెండో ఎయిర్‌పోర్ట్ రేస్..!

స్థల సేకరణకు కర్ణాటక కసరత్తు
హోసూరులో ఏర్పాటు చేస్తామంటున్న తమిళనాడు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు పరిధిలో మరో విమానాశ్రయం ఏర్పాటుకు స్థల సేకరణ దిశగా చర్యలు మొదలయ్యాయి. రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ నగరపరిధిలో మరో ఎయిర్‌పోర్ట్ అవసరమని పదిరోజుల క్రితం ప్రకటించారు. సమీప ప్రాంతాల్లో స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. అంతలోనే తమిళనాడు సీఎం స్టాలిన్ ఆ రాష్ట్ర శాసనసభలో హోసూరు వద్ద ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామని ప్రకటించారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలోనే తమిళనాడు విమానాశ్రయం ఏర్పాటు చేయాలనుకోవడం రాష్ట్రాల మధ్య విబేధాలకు కారణమవుతోంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు ఏటా ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో ట్రాఫిక్ నియంత్రించేదిశగా 150 కిలోమీటర్ల దూరంగా మరో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలనేది కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రతిపాదనకు సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తుమకూరులో 8వేల ఎకరాల భూమి సిద్ధంగా ఉందని, అక్కడ విమానాశ్రయ ఏర్పాటుకు అనుకూలమనే ప్రతిపాదనలు వస్తున్నాయి. నెలమంగళ, మాగడి తాలూకాల మధ్య సోలూరు డాబస్‌పేట ప్రాంతాల్లో అధికారులు భూమిని పరిశీలించి, సమీక్షించారు. తుమకూరు జిల్లాలో మధుగిరి, కొరటగెరె, శిరల మధ్య కర్ణాటక ఇండస్ట్రియల్ బోర్డు 8వేల ఎకరాలకు ప్రతిపాదనలు పంపింది. ఇక చిత్రదుర్గ ప్రాంతం తగిన స్థలంగా భావిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం ఉండే విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల లోపు మరో విమానాశ్రయానికి అనుమతులు ఇవ్వరు. ఇదే కారణంగా బెంగళూరుకు దూరంగా ఉండే శిర, పావగడ ప్రాంతాలలో స్థలాలను ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. హోసూరు నగరం బెంగళూరుకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున అక్కడికి అనుమతులు వస్తాయా అనేది సందేహంగా ఉంది.

దేవరాజెగౌడకు బెయిల్ మంజూరు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో హాసన్ జిల్లాకు చెందిన న్యాయవాది దేవరాజెగౌడకు హైకోర్టు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పెన్‌డ్రైవ్‌లు వైరల్ చేయడంతోపాటు అత్యాచారం కేసులో దేవరాజెగౌడ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. హాసన్‌లోని ఐదో అదనపు సివిల్ కోర్టు దేవరాజెగౌడకు జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించింది. దీంతో ఆయన జైలులో ఉండేవారు. దేవరాజెగౌడ తరఫు న్యాయవాదులు హైకోర్టులో బెయిల్‌కోసం పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ఏకసభ్య ధర్మాసనం, సోమవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.



అమ్మను చూసి

దర్శన్ కంటతడి

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో జైలుపాలైన నటుడు దర్శన్‌ను పరామర్శించేందుకు బెంగళూరు పరప్పన అగ్రహార జైలుకు దర్శన్ తల్లి మీనా తూగుదీప, తమ్ముడు దినకర్ తూగుదీప సోమవారం వెళ్లారు. అమ్మను చూసిన దర్శన్, ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. కాసేపు మాట్లాడకుండా మౌనంగా గడిపినట్లు సమాచారం. ఆ తర్వాత తల్లి మీనా ఓదార్చి ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది. తమ్ముడు దినకర్ కూడా ధైర్యం చెప్పినట్లు సమాచారం. దర్శన్ జైలుకు వెళ్లిన తర్వాత తల్లి, తమ్ముడు తొలిసారి వెళ్లారు. దర్శన్ భార్య విజయలక్ష్మి, కుమారుడితో కలసి కొడగుకు వెళ్లారు. బెంగళూరులో అభిమానుల తాకిడి, ఇతరత్రా సమస్యలతో ఆమె ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొన్నిరోజులపాటు నగరానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

కొత్త చీఫ్ సెక్రటరీ ఎవరో..?

రేసులో ప్రధానంగా ముగ్గురు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ పదవి ఉత్కంఠ రేపుతోంది. ఈ నెలాఖరుతో సీఎస్ రజనీశ్ గోయెల్ పదవీకాలం ముగుస్తుంది. సీనియారిటీ ప్రకారం అజయ్ సేఠ్‌తో పాటు ప్రస్తుత సీఎస్ రజనీశ్ గోయెల్ భార్య శాలిని రజనీశ్ ఉన్నారు. అజయ్‌సేఠ్ కేంద్రంలో కీలక హోదాలో కొనసాగుతున్నారు. శాలిని రజనీశ్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. సీఎం కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎల్‌కే అతీక్ పేరు కూడా వినిపిస్తోంది. రజనీశ్ గోయెల్ భార్య శాలిని రజనీశ్ సీఎస్‌గా నియమితులైతే.. 23 ఏళ్ల తర్వాత భర్త తర్వాత భార్య సీఎస్ అయినట్లు అవుతుంది. 2000 డిసెంబరులో బీకే భట్టాచార్య తర్వాత ఆయన భార్య థెరెసా భట్టాచార్య సీఎస్ అయ్యారు. శాలిని రజనీశ్ 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆమె మరో మూడేళ్లపాటు సర్వీస్‌లో ఉంటారు. సీనియారిటీ ప్రాధాన్యతాపరంగా అజయ్‌సేఠ్ సీఎస్ కావాల్సి ఉంది. అయితే ఆయన కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అక్కడ కీలకమైన హోదాలో ఉన్న అజయ్ సేఠ్, రాష్ట్ర సర్వీసులకు రావడం అనుమానమే. సేఠ్ పదవీకాలం మరో పది నెలలు మాత్రమే ఉంది. ఆయన 1987 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2021 ఏప్రిల్ నుంచి కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ కార్యదర్శిగా ఉన్నారు. జాబితాలో పేరు వినిపిస్తున్నవారిలో ఎల్‌కే అతీక్ కూడా ఉన్నారు. ప్రస్తుతం సీఎం అదనపు ముఖ్యకార్యదర్శి హోదాతోపాటు ఆర్థికశాఖ అదనపు ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన అతీక్‌కు వివిధ కీలక శాఖల్లో పనిచేసిన అనుభవం ఉంది. 2025 వరకు ఆయన సర్వీసులో ఉంటారు. అయితే సీనియారిటీ ప్రాధాన్యతాపరంగా శాలిని రజనీశ్‌కు అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చొరవ చూపితే ఎల్‌కే అతీక్‌కు అవకాశం లభించవచ్చు.



అజయ్‌సేఠ్, శాలిని రజనీశ్, ఎల్‌కే అతీక్

లోక్‌సభ ఓటమిపై నిజనిర్ధారణ కమిటీ

- డీకే శివకుమార్

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు జోరుగా సాగుతున్నట్టు కనిపిస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో ఆశించిన స్థాయి ఫలితాలు ఎందుకు రాలేదో తేలుస్తామని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పేర్కొనడం వేడిని పెంచింది. కాంగ్రెస్ పార్టీ పదాధికారుల సభ సోమవారం జరిగింది. అధ్యక్షుడు డీకే శివకుమార్ ఏర్పాటు చేసిన ఈ సభకు 190 మంది పదాధికారులకు ఆహ్వానాలు పంపగా దాదాపు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆశించినంత ఫలితాలు సాధ్యం కాలేదని వ్యాఖ్యానించిన ఆయన, కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఓటమిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం 15 స్థానాలు గెలుస్తామనే విశ్వాసం ఉండేదని అన్నారు. కల్యాణ కర్ణాటక మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఓటమి ఎదురైందని అన్నారు. వీటికి కారణాలు ఏమిటో తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. శాసనసభ నియోజవర్గాల వారీగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆ కమిటీకి సూచించారు. ఎన్నికల్లో ఆరుగురు మహిళలకు అవకాశం ఇవ్వగా.. కేవలం ఇద్దరు గెలుపొందారని అన్నారు. లోక్‌సభ ఎన్నికలపై ఓటమికి కారణాలను గుర్తించేందుకు ప్రతి రాష్ట్రానికీ ఏఐసీసీ నిజనిర్ధారణ కమిటీ వస్తుందని అన్నారు. వారు ప్రతి నియోజకవర్గంలోనూ పర్యటించడం అసాధ్యమని, అందుకే రాష్ట్రస్థాయిలో ఒక నివేదిక తీసుకురాదలిచామని అన్నారు. మూడు శాసనసభ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేల ఇళ్లలో సభలు పెట్టే అవకాశం లేదని అన్నారు. పార్టీలో రవాణా, మురికివాడలు, సహకార, అపార్ట్‌మెంట్ క్షేమాభివృద్ధి విభాగాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. మూడు సభల్లో పాల్గొనని పదాధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు 15 రోజులకు ఒకసారి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఐ కోటాలో మెడికల్ సీట్లు పెంచే విషయమై కేంద్రానికి లేఖ రాస్తామని అన్నారు. మధ్యాహ్నం తర్వాత డీకే శివకుమార్ చెన్నపట్టణ తాలూకా విరూపాక్షపురం, అరళాళుసంద్రలో జనస్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు డీకే శివకుమార్

గ్యారెంటీలు ఇచ్చినా బీజేపీవైపే జనం

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలు ఇచ్చినా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీవైపే మొగ్గు చూపారని కేంద్ర పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి అభిప్రాయపడ్డారు. ధారవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమాలు, అభివృద్ధి కంటే సీఎం, డీసీఎం మధ్య పోరే ఎక్కువైందని ఎద్దేవా చేశారు. డీసీఎం పదవులు ఎక్కువ కావాలని సీఎం తన ఆప్తుల ద్వారా వివాదాన్ని తెరపైకి తెచ్చారని, మరోవైపు సీఎంను మార్చాలని డీసీఎం తన అనుచరుల ద్వారా చెప్పిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పరిస్థితి దారితప్పిన కోతిలా మారిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందని అనుకుంటున్నా.. అటువంటి ప్రక్రియ ఏదీ జరగలేదని అన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్‌కు ఘోరమైన పరిస్థితి ఎదురైందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసుగు చెందారని అన్నారు. అధికారులకు సరైన మార్గదర్శకం చేసేవారు లేకుండా పోయారని అన్నారు. పాలన నిర్వీర్యం అవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్గత సమస్యలను వారు వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా కలబురగిలో మంత్రి ప్రియాంక ఖర్గే మాట్లాడుతూ, డీసీఎం పదవి కోరే హక్కు అందరికీ ఉందని, అయితే ఎక్కడ ప్రతిపాదించాలనేది ముఖ్యమని అన్నారు. వీధి గొడవల తరహాలో చర్చించడం సరికాదని అన్నారు. కేపీసీసీ అధ్యక్షుడి మార్పు గురించి తనకు తెలియదని, తాను రేసులో లేనని దాటవేశారు. కాంగ్రెస్ నాయకుల మధ్య కుల వివాదం రోడ్డెక్కిందని మాజీ మంత్రి ఈశ్వరప్ప అన్నారు. సీఎం ఆర్థిక సలహాదారు బసవరాజ రాయరెడ్డి కలబురగిలో మీడియాతో మాట్లాడుతూ, డీసీఎంలకు గుర్తింపు లేదని, అటువంటి పోస్టు కావాలని డిమాండ్ చేయడం అర్థం లేనిదని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు జరగదని స్పష్టం చేశారు.



సీఎంకు ప్రెస్‌క్లబ్ పదాధికారుల సన్మానం

మార్పు కోసం పనిచేయాలి

పాత్రికేయులకు సిఎం సిద్ధూ సూచన

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): పత్రికల ద్వారా సమాజంలో మార్పు రావాలని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పత్రికా దినోత్సవం నిర్వహించారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్, కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, సమాచారశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కర్ణాటకలో 1843 జూలై 1న మంగళూరు సమాచార్ అనే పత్రిక ఆరంభమైందన్నారు. అప్పట్లో జర్మనీ వాసి మోగ్లింగ్ ధర్మప్రచారం కోసం ఆ పత్రికను ప్రారంభించారని అన్నారు. ఆ తర్వాత ఎవరైనా నిర్దిష్టమైన, వాస్తవ సమాచారం అందిస్తే ప్రచురిస్తామని ఆయన ప్రచారం చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే జూలై 1నుంచి పత్రికా దినోత్సవాన్ని నిర్వహించాలని 1996లో తీర్మానించారని అన్నారు. పత్రికల ద్వారా అర్థవంతమైన సమాచారం, సమీక్షలు అందించాలని అన్నారు. ఇటీవల సోషల్ మీడియా ప్రభావం తీవ్రమైందని, నియంత్రణ లేకపోవడంతో వారి ఆలోచనలకు తగ్గట్టుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియాను రద్దు చేసే పరిస్థితి లేనందున, ఫేక్‌న్యూస్ కట్టడి కోసం ప్రతి జిల్లా పోలీస్ స్టేషన్‌లోనూ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. తాను మొబైల్ ఫోన్ వాడటం లేదని, అందుకే సోషల్ మీడియాను చూడటం లేదని అన్నారు. మీడియా, సోషల్ మీడియాపై ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు కృష్ణ ప్రసాద్ ప్రసంగించారు. పత్రికల్లో విలువలు పెరగాల్సిన అవసరం ఉందని, కేవలం వ్యాపార ధోరణి సరికాదని అన్నారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు, సమాచారశాఖ కార్యదర్శి త్రిలోక్‌చంద్ర


కన్నడిగులకే ఉద్యోగాలివ్వాలి

కరవే అధ్యక్షుడు నారాయణగౌడ

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంస్థలో వందశాతం ఉద్యోగాలు కన్నడిగులకే ఇవ్వాలని కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ డిమాండ్ చేశారు. కరవే ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫ్రీడం పార్కులో జరిగిన ఆందోళనలో వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణగౌడ మాట్లాడుతూ, దేశంలో అత్యంత ఎక్కువ భౌగోళిక వనరులు కర్ణాటకలోనే ఉన్నాయని అన్నారు. కన్నడనాడు సాంస్కృతిక, సాహిత్య పరంగా శతాబ్దాల చరిత్ర కలిగి ఉందని అన్నారు. కొత్త విభాగాలు పరిశ్రమల ఏర్పాటుతో కన్నడిగులకు ఉద్యోగాలు లేకుండా పోతున్నాయని అన్నారు. 1983లో సరోజిని మహిషి 58 సిఫారసులు చేయగా 48 అంగీకరించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో సి, డి గ్రూప్ ఉద్యోగాలు వందశాతం కన్నడిగులకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో 2014లో నేషనల్ కళాశాల నుంచి భారీ ర్యాలీ చేపట్టామని గుర్తు చేశారు. సమస్య పరిష్కారం కానందుకే మరోసారి ఆందోళన చేయాల్సి వచ్చిందని అన్నారు.

ఫ్రీడంపార్కులో కరవే నిరసన





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,584.15	1,576.75
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,854	134
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	296	2,427
సామర్థ్యం (టీఎంసీలు)	6.78	3.09

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

పెనుకొండ టౌన్, జూలై 1 : పది నెలల పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. సోమవారం మంత్రి స్వగృహంలో పరిగి మండలానికి చెందిన కార్మికులు వ్రాతపూర్వకంగా వినతిని అందించి వారి గోడును వెళ్లగక్కారు. 11నెలల అరియర్స్ నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వలేదని ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు. రెండు నెలల నుంచి సర్పంచ్, కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు.

జాడలేని వాన

- వరుణదేవుడి కోసం అన్నదాత ఎదురుచూపు
- విత్తు కోసం దుక్కి దున్నిన రైతులు

బళ్లారి సిటీ, జూల్ 1: అన్నదాత వర్షాల కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ సారి రుతుపవనాల్లో బారీ వర్షాలు కురుస్తాయన్న ఆశతో జిల్లాలోని ఐదు తాలూకాల రైతులు నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటూ వర్షాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే వాన జాడ కానరాక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు మేఘావృతమై ఉన్నా చుక్క వాన కూడా కురవడం లేదు. ఎకరాకు రూ. వేలువెచ్చించి పొలాలలను దున్ని నాట్లు వేసేందుకు సిద్ధమైన రైతులు వర్షం కురువకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. నాలుగైదు వారాల క్రితం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేయగా, ఈ ఏడాది రుతుపవనాలు జోరుగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా వర్షాలు కురువకపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే 21,465 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. పగటిపూట ఆకాశంలో మేఘాలుకదలడం, ఆ తర్వాత అదృశ్యం కావడం సర్వసాధారణం అయిపోయింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా నాట్లు నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఎప్పుడు ఏం ఏజరుగుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. షిమోగాతో పాటు మల్నాడు తదితర ప్రాంతాల్లో మంచి వర్షాలు కురిస్తే తుంగభద్ర జలాశయానికి నీరు చేరుతుంది. అయితే వర్షాకాలంలో రిజర్వాయర్ ఇన్ ఫ్లో ఎక్కువగా ఉంటే జూలై, ఆగస్టు తొలివారంలో నీటి విడుదలకు అవకాశం ఉంటుంది. ఎండు భూములకు సాగునీరందక రైతులు వర్ష కోసం ఎదురుచూస్తున్నారు.



పొలాన్ని దున్నుతున్న రైతు



జిల్లాకార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కరవే సభ్యులు

కన్నడిగులకు ప్రత్యేక ఉపాధి చట్టాన్ని రూపొందించాలి: కరవే

బళ్లారి సిటీ, జూలై 1: రాష్ట్రంలో కన్నడిగులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కర్ణాటక రక్షణ వేదిక డిమాండ్ చేస్తూ జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా కర్ణాటక రక్షణవేదిక బళ్లారి జిల్లా అధ్యక్షుడు కగ్గల్ శంకర్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక భౌగోళిక వనరులు కలిగిన రాష్ట్రం మన మాతృభూమి, కర్ణాటక రాష్ట్రం దాని జహజ అందం, అద్భుతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందింది. కన్నడిగులు ప్రశాంతంగా ఉంటారు. హృదయసంపన్నులు, దేశంలో జనాబా నియంత్రణకు తొలిసారిగా ఉల్లంఘించినవారు కన్నడిగులు, కన్నడ దేశం సాంస్కృతికంగా, సాహిత్యపరంగా, చారిత్రాత్మకంగా ఉజ్వల చరిత్ర కలిగిన నేల అని అన్నారు. ఇప్పుడు ఉత్తరాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాల నుంచి జనం వెల్లువలా వస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరు,మైసూరు, హుబ్లీ, మంగళూరు వంటి పెద్ద నగరాల్లో వలసల రేటు పరిమితిని మించిపోయిందన్నారు. వలసల దుష్ప్రభావాల కారణంగా కన్నడ భౌగోళిక, సమాజిక, రాజకీయ ముఖచిత్రం మారుతోంది. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని బెంగళూరు పెద్ద ఎత్తున వలసలతో అల్లాడిపోతోందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో కన్నడిగుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుంది. ఈ సందర్భంగా చానాల్‌శేఖర్, తిప్పారెడ్డి, విశ్వనాథ్,రవికుమార్, సత్యనారాయణ, వీరేశ్, మల్లికార్జున, శివకుమార్, పంపనగౌడ, చాంద్‌భాష, నందిశ్, శ్రీధరశెట్టి, మల్లయ్య,జంగ్లీసాబ్,గణేశ్, బసవరాజు, రేణుకాగౌడ, అమరెగౌడ, శరణ, మంజునాథ, సిద్ధప్ప పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధులకు అడ్డుకట్ట

బళ్లారి సిటీ, జూలై 1: గ్రామాల్లో, పట్టణాల్లో దోమల నివారిస్తేనే వ్యాధులకు అడ్డుకట్ట వేయగలమని జిల్లా వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్.అబ్దుల్లా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పలు వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా బ్రెయిన్ ఫీవర్ భారిన పడుతున్నారని ప్రాణాలతో బయటపడిన వారిలో చాలా మంది నరాల బలహీనత మెంటల్ రిటార్డేషన్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పందులను కుట్టిన క్యూలెక్స్ దోమలు మనుషులను కుట్టడం ద్వారా ఈవ్యాధి మానవులకు వ్యాపిస్తుంది. జ్వరం, తలనొప్పి, మెడ బిగుసుకోవడం, తల తిరగడం, వణుకు లక్షణాలు వస్తాయి.

వ్యాధి నివారణ చర్యలు

1నుండి 15సంవత్సరాల వయసు గల పిల్లలకు 2డోసుల జేఈ వ్యాక్సిన్ ఇవ్వాలి. లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళి సరైన వైద్యం అందించాలన్నారు. పందులను మానవ నివాసం నుండి కనీసం 3 కి.మీ దూరం తరలించాలి.పందుల పెంపకానికి దోమతెరలు బిగించి క్రిమి సంహారక మందులు పిచికారి చేయాలి. సాయంత్రం పూట పిల్లలు బట్టలు వేసుకుని నడవాలి. పడుకునేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలువాడాలి. వరి పొలాల్లో వేప సమ్మేళనం ఎరువు వేయడం వల్ల దోమల వృద్ధిని నివారించవచ్చు కేసులు గుర్తించబడినప్పుడు ఆ ప్రాంతంలోని అన్ని ఇళ్లు ఒక రౌండ్ ఇండోర్ క్రిమిసంహారిక స్ప్రేయింగ్ చేయాలి. ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వీబీడీసీ డాక్టర్ అబ్దుల్లా తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

బళ్లారి సిటీ, జూలై 1: నగర శివారుల్లోని బెస్ట్ కళాశాలలో ప్రథమ పీయూసీ(మొదటి ఇంటర్) విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంస్థ ఉపాధ్యక్షులు కోనంకి తిలక్‌కుమార్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ద్వితీయ పీయూసీతోపాటు నీట్, జేఈఈలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ప్రిన్సిపాల్ విద్యార్థులకు విద్యా కార్యక్రమాల సమాచారాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ పీయూసీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కోనంకి తిలక్‌కుమార్ వైస్‌ప్రెసిడెంట్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, హాస్టల్ అధినేత, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పట్టాలకు ఆధార్ లింక్ తప్పనిసరి: తహసీల్దార్

సిరుగుప్ప, జూలై 1 : పొలం పట్టాలను ఆధార్ కార్డుకు లింక్ చేసుకోవాలని తహసీల్దార్ విశ్వనాథ రైతులకు సూచించారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా 1.72 లక్షలు పొలం పట్టాలు వున్నాయన్నారు. ఇందులో 1.24 లక్షల మంది రైతులు ఆధార్ లింక్ చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన 48 వేల మంది రైతులు ఆధార్ లింక్ చేసుకోవాలని తెలిపారు. ఆదార్ లింక్‌తో ప్రధానమంత్రి సమ్మాన్ పథకం, ఇతర సౌలభ్యాలు, నష్టపరిహారం, ఇన్సురెన్స్ నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.

సిరుగుప్పలో భారీ వర్షం





పొంగి పొర్లుతున్న మురుగునీరు, పాత పోలీస్ స్టేషన్ వద్ద నిలిచిన నీరు

సిరుగుప్ప, జూలై 1 : తాలుకా వ్యాప్తంగా సోమవారం పలు ప్రాంతాల్లో జోరు వాన కురిసింది. జూలై మొదటి రోజే వర్షం పడటంతో ఈ సారి రెండు పంటలు అందించవచ్చునని రైతులు ఆశాజనకంగా వున్నారు. భారీవర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురికి వాడ ప్రాంతాల్లో డ్రైనేజీలు ఉప్పొంగి రోడ్లపైకి పారాయి. పాత పోలీస్ స్టేషన్‌లో వర్షపు నీరు దూసుకెళ్లాయి. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవలతోనే గుర్తింపు: తహసీల్దార్



రెవెన్యూ డే వేడుకల్లో పాల్గొన్న అధికారులు

కంప్లి, జూలై 1 : రెవెన్యూ శాఖలో వుండే సిబ్బంది తమ విధులు, చేపట్టిన సేవలే వారికి ప్రజల్లో గుర్తింపునిస్తాయని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. సోమవారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి రైతులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు తమ కార్యాలయాలకు ఎన్నో సమస్యలపై వస్తుంటారని వారితో చర్చించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించినట్లయితే తమ శాఖకు, తమ ఉద్యోగానికి గుర్తింపు పొందుతారని తెలిపారు. ప్రతి యేటా రెవెన్యూ డేను నిర్వహించుకుంటామన్నారు. వారితో పాటు డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రకుమార్, షణ్ముఖప్ప, ఆర్ఐ జగదీప్, రమేష్, గ్రామ లెక్కల సంఘం అధ్యక్షులు మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

కంప్లి, జూలై 1: కంప్లిసత్యనారాయణ పేటలో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమాజం ప్రతి ఒక్కరు ధార్మిక కార్యక్రమాల వల్ల ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. అనంతరం పూజల్లో పాల్గొన్న వారికి అన్నప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.



కరియప్ప సేవలు మరువలేనివి: ఎస్పీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రంజిత్‌కుమార్, కరియప్ప, మఠాధీశులు తదితరులు

బళ్లారి సిటీ, జూలై 1: తొలి కన్నడ పత్రిక మంగళూరు సమాచారాన్ని ముద్రించి కరియప్ప పత్రికారంగానికి ఎనలేని సేవలు చేశారని ఎస్పీ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని బీడీఏఏ మైదానం హాల్లో బళ్లారికి చెందిన జోళదరాశి తిమ్మప్ప ఫౌండేషన్, పత్రికా మిత్రుల ఆధ్వర్యంలో పత్రికాదినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారం కార్యక్రమంలో ఆయన పత్రికా దినోత్సవం, విద్య ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు మీడియా సమానత్వం స్పష్టమైన నివేదికల ద్వారా శాంతికి దర్పణం పట్టాలని సూచించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... రోజూ దినపత్రిక చదివిన వారికి ఎలాంటి ఉమ్మడి పరీక్షలనైనా ఎదుర్కొనే మేధోశక్తి లభిస్తుందని, నిరంతరం దినపత్రిక చదవాలని, సమాజ పరిణామాలు తెలియకుంటే మన జీవితాలను తీర్చిదిద్దుకోలేమని అన్నారు. కార్యక్రమంలో వివిధ పీఠాధిపతులు పాల్గొని ఆశీర్వచనాలు అందజేశారు. జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు మాట్లాడుతూ పత్రికా రంగం సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. మీడియా రంగంలోని రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్లు, మీడియా జర్నలిస్టులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా బళ్లారికి చెందిన జర్నలిస్టు ఎం.అహిరాజ్, హొసకెరె నంజుండగౌడ, డీడీపీఐ ఉమాదేవి హాజరయ్యారు. ఈసందర్భంలో జర్నలిస్టు శశిధర మేటీ, రవికుమార్, తదితర పత్రికా మిత్రులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

అగళి, జూలై 1: కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. అక్రమ కేసులకు పాల్పడవద్దని శిక్ష పెద్దగా ఉంటుందని అగళి ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన చట్టాలపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఐపీసీ 1860 క్రైమ్ పీసీ 1973చట్టం ఇండియన్ ఎంవైవర్మెంట్ యాక్ట్ 1872 ప్రకారం ప్రతి కేసులో కూడా ఎవరైనా అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడితే ఐదు సంవత్సరాల నుంచి పది, 15సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జూలై 1నుంచి ఈ నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని వీటిని దృష్టిలో ఉంచుకుని మీరు మెలగాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. తాస్కారం చేయకుండా ఉండాలన్నారు. జూదం, గంజాయి, అక్రమ మద్యం, రోడ్డు ప్రమాదాలు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, 18సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులు వాహనం నడిపితే శిక్షలు తప్పవన్నారు. వీటన్నింటికి కూడా కేసు నమోదైతే శిక్షలు పడడం సత్యమన్నారు. మీరుకూడా గ్రామాలలో మీ తల్లిదండ్రులకు ఇతరులకు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రామస్థులకు నూతన చట్టాల్లో విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బషీర్, కానిస్టేబుల్ రాజన్న, శివ, అనీల్‌కుమార్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

గోరంట్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రేశపెట్టిన చట్టాల గురించి గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాత చట్టంలోని లొసుగుల కారణంగా సాక్ష్యాధారాలు లేక కేసులు వీగిపోయేవని సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. వీడియోగ్రఫీ, ఫోటో గ్రఫీ ద్వారా ప్రతిష్టాత్మకంగా పాత చట్టాల స్థానంలో కొత్తచట్టాలు మార్పు చేశారన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐలు మద్దిలేటి, ధనుంజయరెడ్డి, ప్రజలు, పోలీసులున్నారు.

గుడిబండ : గుడిబండ పోలీస్ స్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపై ప్రజలకు సోమవారం డీఎస్పీ బాజీజాన్ సైదా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(పరిగి) : పరిగి పోలీస్ స్టేషన్‌లో కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సోమవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ 1867లో బ్రిటిష్ కాలంలో ప్రవేశపెట్టిన చట్టాలను తొలగించి 2024జూలై 1 నుంచి భారత రాజ్యాంగ ప్రభుత్వం కొత్తచట్టాలను అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు.



ఇందిరా క్యాంటీన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

పేదల ఆకలి తీర్చడానికే ఇందిరా క్యాంటీన్లు: ఎమ్మెల్యే

కంప్లి, జూలై 1: పేదల ఆకలి తీర్చడానికే ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించారు. తాలుకా స్థాయిలో పట్టణ నడిబొడ్డున అందరికీ అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంతో మంది పట్టణంలో తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి ఇందిరా క్యాంటీన్‌ను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే కంప్లి పట్టణంలో గంగావతి రోడ్డు, బళ్లారి, కురుగోడు రోడ్డు ధ్వంసమైన రోడ్డు పనులను కూడా త్వరగా పనులు జరిపి కూడా అంతరాయం కలగకుండా చేస్తామన్నారు. అలాగే రైల్వే లైన్‌కు సంబంధించిన కేంద్రాన్ని అందరితో చర్చించి కంప్లి మీదుగా రైల్వే ట్రాక్ ఏర్పడేలా చేస్తామన్నారు. మున్ముందు పట్టణంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరితోపాటు ముఖ్య అధికారి దుర్గన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు వీరాంజనేయులు, నారాయణప్ప, అంజినప్ప, మస్తాన్, మౌనేష్, విరుపాక్షి, సుధీర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

బళ్లారి రూరల్, జూలై 1: బళ్లారి తాలుకాలోని బెణకల్ గ్రామంలో ప్రాథమిక ప్రౌఢశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన మాణిక్య, ప్రణీత్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి మాణిక్యప్రణీత్ హీలింగ సెంటర్ సంస్థ మేనేజర్ యుతానందన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో పిల్లలకు ప్రధానోపాధ్యాయులు మృత్యుంజయ, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు గంగాధర, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు



సర్మాస్‌ను సత్కరిస్తున్న పురసభ సిబ్బంది, అధికారులు

ఉద్యోగికి ఘన సన్మానం

తోరణగల్లు, జూలై 1 : కురేకుప్ప పురసభలో ఉద్యోగిగా పని చేస్తు పదవీ విరమణ పొందిన సర్మస్‌కు పురసభ సిబ్బంది, అధికారులు, ప్రముఖులు ఘనంగా సన్మానించి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన సర్మస్ గురించి తన సహ ఉద్యోగులు, అలాగే పురసభ అధికారులు, వీడీ రాఘవేంద్ర గురు, అధికారి అరుణ్ కుమార్ఆయన పనిచేసిన పద్ధతిని, ఆయన మంచితనంను కొనియాడారు. ఈ సందర్భంగా పురసభ అధికారి సతీష్, సోమప్ప, బసవన్నగౌడ, కుమారప్ప రిటైర్ పొందిన సర్మస్ కుటుంబ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోతుంది: ఎంపీ పార్థ

హిందూపురం, జూలై 1 : దేశ చరిత్రలోనే ఇంత పెద్దమొత్తంలో పింఛన్లు ఇవ్వడం చరిత్రలో నిలిచిపోయే ఘనత అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజికభద్రత పింఛన్లపంపిణీ కార్యక్రమంలో భాగంగా రొద్దం మండలం మరువపల్లిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు రూ.7వేలు చొప్పున పింఛన్ సొమ్మును అందించారన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటే నెరవేర్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈ పింఛన్లవల్ల వృద్ధులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నవారు వారి కుటుంబాలకు భారం కారన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడు చంద్రబాబు అన్నారు.

హోసూరు జోన్

వృత్తివిద్య శిక్షణాసంస్థల్లో రెండో విడత కౌన్సెలింగ్

హోసూరు(కృష్ణగిరి), జూలై 1: ప్రభుత్వ వృత్తివిద్య శిక్షణాకేంద్రం హోసూరు, డెంకణీకోట, కృష్ణగిరి జిల్లాలోని ప్రైవేట్ వృత్తి శిక్షణా కేంద్రాలలో 2024-25 ప్రవేశానికి సంబంధించిన ప్రిలిమినరీ కౌన్సెలింగ్ జూన్ 28వరకు జరిగింది. ఈ సందర్భంగా మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ఇంకా అడ్మిషన్ పొందని అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించడానికి, ప్రిలిమినరీ కన్సల్టేషన్ కోసం దరఖాస్తు చేసి వృత్తి విద్యా శిక్షణా కేంద్రం, వృత్తి విద్యా విభాగం కేటాయింపులు పొందని అభ్యర్థులకు రెండో విడతలో అవకాశం కల్పించనున్నారు. సోమవారం నుంచి ఈనెల 15వరకు నుంచి స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ జరగనుంది. శిక్షణ కాలంలో శిక్షణ పొందిన వారికి నెలవారీ రూ.750, ఉపకార వేతనంతో పాటు ఉచిత టెక్స్ బుక్, ఉచిత డ్రాయింగ్ టూల్స్, ఉచిత ల్యాప్‌టాప్, ఉచిత యూనిఫాం, ఉచిత సైకిల్, ఉచిత బస్ పాస్, ఉచిత పాదరక్షలు అందజేస్తారు. హోసూరు, డెంకణీకోట నుంచి విద్యార్థులు, ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రాలలో నేరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు డిప్యూటీ డైరెక్టర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వృత్తి శిక్షణా సంస్థ, హోసూరు ఫోన్ నెంబర్ 04344-262457, 8098663711 ప్రిన్సిపాల్, ప్రభుత్వ వృత్తి శిక్షణాసంస్థ, డెంకణీకోట ఫోన్ నెంబర్ 9442525608, 9444215926 జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి

హోసూరు(క్రైం), జూలై 1: ప్రాణాలు కాపాడాల్సిన అంబులెన్స్ అకస్మాత్తుగా ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. హోసూరు సానసందిరంనకు చెందిన నంజుండస్వామి కుమారుడు పెయింటర్‌గా పని చేసే హరీశ్(19) అదే ప్రాంతానికి చెందిన మోహన్(18)తో కలసి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై రాయకోట రోడ్డుల్లో వెళ్తుండగా అప్పుడు అటుగా వెళ్తున్న అంబులెన్స్ ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయపడ్డ మోహన్‌ను చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 1: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని బూడిదగడ్డపల్లికి చెందిన వెంకటేష్ కుటుంబ కలహాల కారణంగా విషద్రావకం తాగి సోమవారం ఆత్మహత్యయత్నాకి పాల్పడ్డారు. బూడిదగడ్డపల్లికి చెందిన వెంకటరామప్పకుమారుడు వెంకటేష్ కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్థాపానికి గురై విషద్రావకం సేవించి అస్వస్థత పొందారు. కుటుంబ సభ్యులు వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉష చికిత్సలు చేశారు.

110 మందికి గడ్డికోత యంత్రాల పంపిణీ

హోసూరు(కృష్ణగిరి), జూలై 1: కృష్ణగిరి జిల్లా పశుసంవర్ధక శాఖ జోనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్ర పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమం క్రింద 110 మంది లబ్దిదారులకు 50 శాతం రాయితీలో రూ.16.91 లక్షల విలువైన విద్యుత్‌తో పనిచేసే గడ్డికోత యంత్రాలను కలెక్టర్ సరయు నేతృత్వంలో పంపిణీ చేశారు. 110 మంది లబ్ధిదారులకు ఎలక్ట్రిక్ లాన్ మూవర్స్ అందించారు. వీటివల్ల పశుగ్రాస పంటల వృథా తగ్గడంతో పాటు పశువులకు పీచుపదార్థం లభించి జీర్ణశక్తిని పెంచి పాల ఉత్పత్తికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ సి.ఇళంగోవన్, డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎ.మరియసుందర్, ఎ.అరుళ్‌రాజ్, జె.మహేంద్రన్, వెటర్నరీ అసిస్టెంట్లు ఎ.దినేశ్, ఎం.అఖిల్‌రాజ్, సి.శివశంకరి, కె.ప్రేమ్‌కుమార్, బి.అన్బరసు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ గ్రాస్ కట్టర్లను అందజేస్తున్న కలెక్టర్ సరయూ

ధరల గుభాళింపు

హోసూరు, జూలై 1: హోసూరు కెలమంగలం, బాగలూరు, బేరికై, శూలగిరి, డెంకణీకోటై తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యల్లో రైతులు సుమారు 3 వేల ఎకరాల్లో చెండుమల్లి, ముల్లై, కనకాంబరం, సంపంగి, చామంతి తదితర పూల సాగుచేస్తున్నారు. ఇక్కడ పండించే పూలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు విక్రయిస్తారు. హోసూరు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పూల దిగుబడి తగ్గింది. ఇలా చామంతి పూల ధర కిలో రూ.260 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. గుండుమల్లి సరఫరా పెరగడంతో కిలో ధర రూ.260కి విక్రయిస్తున్నారు. వేసవిలో రూ.10కి విక్రయించిన చామంతి ఇప్పుడు ఈ ధరకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా గుండుమల్లి రూ.1000 నుంచి రూ.1,500 వరకు పలికింది. ప్రస్తుతం ఇలా రూ.260కి వచ్చింది. గుండుమల్లె ధరకు సమానంగా చామంతి ధరలు పలకడంతో రైతులు హర్షం తెలియజేస్తున్నారు. హోసూరు పూల మార్కెట్‌కు సరిహద్దులోని అత్తిబెలె, ఆనేకల్ ప్రాంతాల రైతులు కొనుగోలు చేసుకునేందుకు వస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పూలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

నోస్ట్రడామస్ (వర్ధంతి)



ఫ్రాన్స్ దేశానికి చెందిన సిద్ధాంతకర్త మైఖేల్ డి నోస్ట్రడామస్ 1503 డిసెంబరు 15న జన్మించారు. రాబోవు సంఘటనలను ఊహించి, ముందే తన రచనలలో రాసుకున్నాడు. ఈ రచనలకు ప్రొఫెటీస్ ఆఫ్ నోస్ట్రడామస్ అని పేరు. తెలుగులో కాలజ్ఞానం వంటిది. ప్రపంచంలో ఎన్నో అంశాలు ఆయన పేర్కొన్నట్టు చోటు చేసుకోవడం గమనార్హం. అంతేకాక మెడికల్ సైన్స్‌పైన కూడా రెండు పుస్తకాలు రాశారు. 1566 జూలై 2న కన్నుమూశారు.

ఓవీ విజయన్ (జయంతి)



మళయాళ సాహిత్యంలో గొప్ప రచయితగా పేరొందిన పద్మభూషణ్ గ్రహీత ఓవీ విజయన్ 1930 జులై 2 కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో జన్మించారు. జర్నలిస్టుగానే కాక కార్టూనిస్ట్‌గా కూడా పేరొందారు. 6 నవలలు, 9 చిన్నకథల కలెక్షన్స్, 9 వ్యాసాలు రాశారు. ఆయన రచనలను తానే సొంతంగా ఆంగ్లంలోకి అనువాదం చేయడం మరో ప్రత్యేకత. కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, వాయలార్ అవార్డు, మాతృభూమి లిటరరీ అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2005 మార్చి 30న కన్నుమూశారు.

గురువాయూర్ దురై (పుట్టినరోజు)



ప్రముఖ మృదంగ వాద్య కళాకారులలో ఒకరైన గురువాయూర్ దురై 1935 జూలై 2న కేరళ రాష్ట్రం గురువాయూర్‌లో జన్మించారు. చిన్నతనంలో పాల్ఘాట్ సుబ్బయ్యర్ వద్ద, తర్వాత ఈవీ నారాయణ పిశరోడి వద్ద మృదంగం నేర్చుకున్నారు. అనంతరం పళని సుబ్రమణ్య పిళ్ళై వద్ద గురుకులం తరహాలో పూర్తిస్థాయి శిక్షణ పొందారు. అనంతరం టీఎన్ రాజరత్నం పిళ్ళై, నామగిరి పెట్టై కృష్ణన్‌లకు కచేరీలో మృదంగం సహకారం అందించారు. సంగీత కళాశిఖామణి, కళైమామణి, సంగీత నాటక అకాడమీ ఠాగూర్ రత్న, సంగీత నాటక అకాడమీ అవార్డులు అందుకున్నారు.

గణేశ్ (పుట్టినరోజు)



కన్నడ సినీరంగంలో పేరొందిన గోల్డెన్‌స్టార్ గణేశ్ 1978 జూలై 2న బెంగళూరు గ్రామీణ జిల్లా నెలమంగల తాలూకా అడకమరన హళ్ళిలో జన్మించారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటులలో ఒకరిగా నిలిచారు. 2006లో 'ముంగారు మళె' సినిమా ఏడాది పాటు మల్టిప్లెక్స్‌లో ప్రదర్శించబడి గోల్డెన్‌స్టార్‌గా పేరొందారు. బుల్లితెరపై పలు సీరియల్స్‌లో నటించారు. ప్రత్యేకించి కామెడి టైమ్ షోతో రాణించారు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

» రీలర్లతో పట్టుగూళ్ల మార్కెటింగ్ సహాయక డైరెక్టర్ కే తిమ్మరాజు

శిడ్లఘట్ట, జూలై 1: పట్టణంలో పట్టు రంగంపై ఆధారపడ్డ మైనారిటీ రీలర్‌లకు ప్రభుత్వం నుంచి అందే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పట్టుగూళ్ల మార్కెటింగ్ సహాయక డైరెక్టర్ కే తిమ్మరాజు తెలిపారు. ప్రభుత్వపట్టుగూళ్ల మార్కెట్ ఆవరణలో ఏర్పాటైన రీలర్‌ల సమావేశంలో మాట్లాడుతూ మైనారిటీ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి లభిస్తున్న పథకాలను వివరిచారు. ఇప్పటికే ట్రైనింగ్ పొంది నూలు వడికేందుకు లేదా రీలర్‌లుగా ఉన్నవారు కార్పొరేషన్ నుంచి రూ.2లక్షల రుణం పొందవచ్చునన్నారు. ఇందులో 50శాతం సహాయధనం ఉంటుందన్నారు. వర్కింగ్ కేపిటల్‌గా ఇచ్చే రుణసదుపాయాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. 18-50 ఏళ్ల వారు అర్హులని, రాష్ట్రవాసులై ఉండాలని, గతంలో రుణం పొంది ఉండరాదన్నారు. సాంకేతిక విభాగం సహాయక డైరెక్టర్ రామకుమార్ మాట్లాడుతూ ప్రతి కేజీ పట్టుకు సహాయధనం రూ.1200 ఉండగా, 900, 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో రీలింగ్‌కు సంబధించిన వివరాలు వివరించారు. ఆటోమేటిక్ రీలింగ్ విభాగానికి, డోపియన్ విభాగం పోస్ సంస్కరణకు, మల్టిల్యాండ్ రీలింగ్ విభాగం, ఇలా ఒక్కో విభాగానికి ఒక్కోరకమైన సహాయధనం లభిస్తుందన్నారు. జనరేటర్ సోలార్ వాటర్ హీటర్ ఇతరత్రా అమరికలకు సంబంధించి సహాయధనం లభిస్తుందన్నారు. మార్కెట్ డిప్యూటీ డైరెక్టర్ మహదేవయ్య, పట్టు రీలర్‌ల సంఘం అధ్యక్షుడు అన్సర్‌ఖాన్, ఫారూక్ పాషా, జి రెహమాన్, కే ఆనంద్, బంగారు, రామకృష్ణప్ప, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రీలర్లు

అభివృద్ధి పనులకు శ్రీకారం

మహదేవపుర, జూలై 1: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి శ్రీకారం చుట్టారు. కావేరినగర, చిక్కణ్ణ లే అవుట్, కుందలహళ్ళి కాలనీ, బీఈఎంఎల్ లే అవుట్, వర్తూరు, సొరహుణసే, మధురానగర్ సహా పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులకు సోమవారం భూమిపూజ చేశారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు, డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నాణ్యత పాటించేలా పర్యవేక్షించాలన్నారు. ఇదే సందర్భంగా వర్తూరు స్లమ్‌బోర్డు మధురానగర్‌లో శుద్ధతాగునీటి కేంద్రం, సొరహుణసేహళ్ళిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. మధురానగర్‌లో పీయూ కాలేజీలో వేదిక నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇదే సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ విశ్వశాంతిప్రియ కన్నడసంఘం ఆధ్వర్యంలో స్థానికులకు తడి, పొడిచెత్త సేకరణ కోసం బుట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహేంద్ర మోది, వర్తూరు శ్రీధర్, నవీన్‌చౌదరి, బీబీఎంపీ అధికారులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రి పంపిణీ



ఉచిత నోటు పుస్తకాలతో విద్యార్థులు

శిడ్లఘట్ట, జూలై 1: గ్రామీణ ప్రాంతాల, పేద విద్యార్థుల ఉత్తమ విద్యకోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, స్వచ్ఛంద సంస్థలు కూడా సహకారం అందిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమీడియం ప్రారంభమైందని ఆసక్తిగలవారు చేర్పించాలని సూచించారు. తాలూకాలోని సుగుటూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రవికుమార్ సహకారంతో నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలల వ్యామోహం వీడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఉచిత సైకిళ్లు, భోజనం, యూనిఫాం, పుస్తకాలు, షూ ఇతరత్రా సదుపాయాలు ఉన్నాయన్నారు. శాటిలైట్ ఆధారిత చానెల్‌లో ప్రత్యేక బోధనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు వెంకటేశ్ అధ్యక్షత వహిచారు. గ్రామపంచాయతీ సభ్యులు నారాయణస్వామి, ఎస్‌డీఎంసీ సభ్యులు ఆరతి, మాజీ సభ్యులు అశ్వథ్, నాగరాజ్, మధుసూధన్, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల జీవనం దుర్భరం

ఏపీ ప్రభుత్వం తరహాలో ఆదుకోవాలి: మంజునాథరెడ్డి

బాగేపల్లి, జూలై 1: ప్రజాస్వామ్య నాలుగో స్తంభమైన మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయుల జీవనం దుర్భరంగా తయారైందని పాత్రికేయుల సంఘం తాలూకా అధ్యక్షుడు పి.మంజునాథరెడ్డి అన్నారు. బాగేపల్లి పట్టణంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సభ్యులకు ఎల్‌ఐసీ బాండ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత్రికయుల కుటుంబాలకు వైద్యం, విద్యను ఉచితంగా కల్పించాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులు ఏడాదిలో 365 రోజులు పనిచేస్తుంటారని అన్నారు. రాష్ట్ర, దేశ రాజకీయాలతోపాటు చుట్టుపక్కల సమాజంలో జరిగే అంశాలను, ప్రభుత్వ పథకాలను, ఇతర అంశాలను పత్రికల ద్వారా ప్రజలకు చేరుస్తున్నారని అన్నారు. పేపర్ డిస్ట్రిబ్యూటర్‌ల జీవనానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేదని విచారం వ్యక్తం చేశారు. పాత్రికేయులు, పత్రికల డిస్ట్రిబ్యూటర్‌లకోసం ప్రభుత్వం పథకాలను నామమాత్రంగా ప్రకటించి, ఆచరణలో విఫలమైందని అన్నారు. పొరుగున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్రికేయులకు ప్రత్యేక సౌలభ్యాలతోపాటు ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేస్తోందని, ఉచిత ఆరోగ్యం, ఉచిత విద్య కల్పిస్తోందని అన్నారు. ఏపీ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పాత్రికేయుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరు. పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ స్కూల్, కళాశాలల్లో ఉచిత విద్య, ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ చలపతి, కార్యవర్గ సభ్యులు జీకే ఆనంద్, సయ్యద్‌సిద్దిక్, బీఎస్ సురేశ్, తాలూకా సంఘం ఉపాధ్యక్షులు రామచంద్ర, ఏజీ నారాయణస్వామి, కోశాధికారి రామకృష్ణ హెగ్డే తదితరులు పాల్గొన్నారు.



పాలసీ బాండ్లతో పాత్రికేయులు

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేయాలి: మంత్రి సత్యకుమార్

అనంతపురం టౌన్, జూలై 1: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లో రాష్ట్ర స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమంపై సోమవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమీషనర్ డాక్టర్ వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బందికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో డాక్టర్లకు మంచి గౌరవం ఉందని, అయితే వైద్య రంగంలో విలువలు తగ్గుతున్నాయని అన్నారు. వైద్యాధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు. వైద్యులు ప్రజలకు అందించే సేవలకు వెల కట్టలేమని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి డాక్టర్లు అందించిన సేవలను ఈ జాతి గుర్తు పెట్టుకుంటుందని అన్నారు.

మలకనాడు మహాసంఘానికి కార్యవర్గం ఏకగ్రీవం

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మలకనాడు మహాసంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. బెంగళూరులో ఆదివారం ఎన్నికలు జరిపేందుకు ఏర్పాట్లు చేయగా సంఘంలో విబేధాలు, పోటీలు వద్దని ఏకగ్రీవం చేశారు. అధ్యక్షులుగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కిశోర్, శ్రీరామ్, ప్రధాన కార్యదర్శిగా కవితా చంద్రశేఖర్, కోశాధికారిగా ఛాయా సత్య నారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. 4వేలమందికిపైగా సభ్యులు ఉండగా ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

నగరవాసుల కోసం లగ్జరీ ఫర్నిచర్

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందు తున్న బెంగళూరులో ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతం మరింత దూసుకుపోతోందని ఇక్కడివాసులకు లగ్జరీ ఫర్నీచర్ అందించేందుకు ప్రత్యేక షోరూం ప్రారంభించినట్టు రాయల్‌ఓక్ ఫర్నీచర్ చైర్మన్ విజయ్‌సుబ్రమణ్యం తెలిపారు. ఎలక్ట్రానిక్‌సిటీలో దేశ విదేశీ ప్రజలు నివసిస్తున్నారని వారికి అనుగుణమైన ఫర్నీచర్ సమకూర్చదలిచామన్నారు. దేశంలోని ప్రధాన నగరాలన్నీ కలిపి 116 ప్రాంతాల్లో 200కుపైగా రాయల్ ఓక్ స్టాల్స్ ఉన్నాయన్నారు. స్థానిక ప్రముఖుల ఆధ్వర్యంలో సోమవారం షోరూం ప్రారంభించారు.

విదేశీ ప్రయాణాల పట్ల పెరుగుతున్న ఆసక్తి

బెంగళూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విదేశాలలో సరదాగా గడిపేదుకు వెళ్లేవారి సంఖ్య పెరుగుతోందని థామస్‌కుక్ సంస్థ ప్రకటించింది. కార్పొరేట్ ట్రావెలర్స్ కోసం ఎంటర్‌ప్రైజ్ ఎఫ్‌ఎక్స్ కార్డును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈమేరకు థామస్‌కుక్ సంస్థ ప్రతినిధులు బెంగళూరులో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీసా, మాస్టర్‌కార్డ్ భాగ స్వామ్యంతో ఎంటర్‌ప్రైజ్ ఎఫ్‌ఎక్స్ కార్డును విడుదల చేసినట్టు తెలిపారు. కార్డు ద్వారా ఖర్చు ను బట్టి రివార్డు పాయింట్‌లు దక్కనున్నాయి. సెలవుల్లో పర్యాటకంకు వెళ్లవచ్చునని, హోటళ్లు, విమాన టికెట్‌లకు ఉపయోగించుకోవచ్చునని, దేశంలోని అంతర్జాతీయ విమా నాశ్రయాల్లో లాంజ్‌లోకి ఉచితంగా ప్రవేశించే వీలుంటుందని ప్రకటించారు. కాంప్లిమెంటరీగా ఇంటర్నేషనల్ సిమ్‌కార్డుతోపాటు ఏటీఎంలో ఉచిత డ్రా సౌలభ్యం ఉంటుందన్నారు. యూత్‌కార్డ్ ద్వారా 125 దేశాలలో 60వేల బ్రాండ్‌లు, 1.50 లక్షల రాయితీలు పొందడం తోపాటు 75వేల రూపాయల సమగ్ర బీమా సదుపాయం ఉంటుందని ప్రకటించారు.

అమరావతికి విరాళాలు

అనంతపురం రూరల్ జూలై 1: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెంచిన పింఛన్ సొమ్ము అందుకున్న పలువురు లబ్ధిదారులు రాజధాని అమరావతి నిర్మాణానికి విరాళం రూపంలో అందజేశారు. కొందరు పూర్తి పింఛన్‌ను, మరికొందరు కొంత సొమ్మును అందజేశారు. అనంతపురం జిల్లా పామిడి మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు సూర్యనారాయణ పింఛన్ సొమ్ము రూ.7 వేలను రాజధాని నిర్మాణానికి విరాళంగా అందజేశారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు.

- అనంతపురం రూరల్ మండలంలోని పాపంపేట పంచాయతీలో 25 మంది పింఛన్‌దారులు ఒక్కొక్కరు రూ.500 చొప్పున రూ.12,500 రాజధానికి కోసం విరాళం ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్‌కు ఈ సొమ్మును అందజేశారు.

ఆనందం కనిపించెన్..!

పింఛన్ లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగింది. ఉదయమే మంత్రులు, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బకాయిలు సహా పెంచిన పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. పలు ప్రాంతాల్లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పింఛన్ అందజేసిన నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారు. గతంలో మాదిరిగా రూ.250లు చొప్పున కాకుండా, ఒకేసారి రూ.1000లు పెంచడం గొప్ప విషయం. రూ.4వేలతో పాటు, బకాయిలు కలిపి రూ.7లు పింఛన్ అందుకున్నా.

- వెంకన్న, ఉరవకొండ

రుణపడి ఉంటాం



అనంతపురం అర్బన్, జూలై 1: నా మేనల్లుడు సుధీర్ విభిన్న ప్రతిభావంతుడు. చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు విభిన్న ప్రతిభావంతుడైన నా మేనల్లుడికి రూ.ఆరు వేలు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చారు. ఇలాంటివారిపై కనికరం చూపి పింఛన్ సొమ్ము పెంచి ఇస్తున్న చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- రామలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుడు సుధీర్ మేనత్త, వెంకట్రావ్ నగర్, అనంతపురం

ఆర్థిక సమస్యలు తీరుతాయి



ధర్మవరం: పింఛన్ సొమ్ముతోనే నేను, నాభార్య జీవిస్తున్నాం. గతంలో ఇచ్చే పింఛన్ డబ్బులతో కుటుంబపోషణ, మందులు, నిత్యావసర సరుకులకు డబ్బులు చాలక ఇబ్బందులు పడేవాళ్లం. ఇలాంటి సమయం లో సీఎం చంద్రబాబు రూ.నాలుగు వేలు పింఛన్ ఇవ్వడంతో ఆర్థికంగా కొన్ని సమస్యలు తీరుతాయి.

- అబ్దుల్ అజీజ్, వృద్ధుడు, ముదిగుబ్బ మండలం



మంత్రితోపాటు పింఛన్ పంపిణీలో పాల్గొన్న కలెక్టర్, అనంతపురం నగరపాలక కమిషనర్



ధర్మవరంలో పింఛన్ అందజేస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మాది చేతల ప్రభుత్వం: మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జూలై 1: మాది మాటల ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వమని ఆర్థిక శాఖ మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతపేటలో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ వినోద్ కుమార్, అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘా స్వరూప్ పాల్గొన్నారు. అంతకుమునుపు మంత్రి స్వగ్రామం కౌకుంట్లలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

వివక్ష చూపం: మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం: వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక భద్రతా పింఛన్లు అందజేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఇచ్చిన మాట మేరకు పింఛన్ సొమ్మును పెంచడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

మాట నిలబెట్టుకున్నాం: సవిత, మంత్రి

హిందూపురం(సోమందేపల్లి): ఎన్నికల హామీ మేరకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలబెట్టుకున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్నేహలతనగర్‌లో సోమవారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ జగన్ అధికారంలో ఉన్నప్పుడు రూ.3వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఐదేళ్లపాటు కొద్దికొద్దిగా పెంచుకుంటూ పోయి జనాన్ని మోసం చేశారన్నారు.

పేదింటి పెద్దకొడుకు చంద్రబాబు



గార్లదిన్నె: ఎన్నికల సమయంలో ఏప్రిల్ నెల నుంచే రూ. నాలుగు వేలు పెన్షన్ ఇస్తానన్న మాట ప్రకారం ఈరోజు రూ. ఏడువేలను అందించి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నాడు. పింఛన్ తీసుకునే మాలాంటి పేదిళ్లకు పెద్దకొడకయ్యాడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

- అనసూయమ్మ, గార్లదిన్నె

వైద్యం చేయించుకుంటా..



కళ్యాణదుర్గం: చంద్రబాబునాయుడు ఈ నెల ఒకేసారి రూ. ఏడు వేలు పింఛన్ ఇచ్చాడు. దీంతో వైద్యం చేయించుకుంటా. ఈ డబ్బు వైద్యఖర్చులతో పాటు మందులకు కూడా సరిపోతుంది. పింఛన్లను పెంచి మాలాంటి వృద్ధులను ఆదుకున్న చంద్రబాబుకు రుణపడి వుంటాం. ఉద్యోగస్థులతో సమానంగా ఇంత మొత్తం రావడం సంతోషంగా వుంది.

- వెట్టిలింగమ్మ, చెన్నంపల్లి, కంబదూరు మండలం

ఇక .. కుటుంబానికి భారంకాను



హిందూపురం: నాకు 66ఏళ్ల వయసు, 25ఏళ్ల కిందటే పక్షవాతం వచ్చి మంచానపడ్డా. అప్పటి నుంచి నా కుటుంబానికి భారంగా మారా. ఈక్రమంలోనే చదివించే స్థోమత లేకపోవడంతో నా ఒక్కగానొక్క కుమారుడు చదువు మానేసి టైల్స్ పనికి వెళ్తున్నాడు. నా భార్య కూలి పనిచేసి ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. ప్రతినెలా నా మందులకు రూ.7వేల నుంచి రూ.8వేల దాకా ఖర్చయ్యేది. ప్రభుత్వం నాకు రూ.5వేలు మాత్రమే ఇచ్చేది. దీనివల్ల ప్రతినెలా రూ.3వేల దాకా నా కుమారుడు, భార్య పని చేసి ఇచ్చేవారు. మహానుభావుడు చంద్రబాబు పుణ్యమా అంటూ రూ.15వేలు ఇచ్చాడు. దీంతో ఇక నుంచి రూ.7వేలు మిగులుతుంది. నా కుటుంబానికి నేను భారం కాను.

- నరసింహమూర్తి, పూలకుంట, హిందూపురం

మా జీవితంలో వెలుగులు చంద్రబాబు చలవే..



రాప్తాడు: నాకు చిన్నప్పుడే పోలియో సోకడంతో నడవడానికి చేతకాదు. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నా. నాకు భార్య, కుమారుడు ఉన్నాడు. భార్య కూలి పనికి వెలుతుంది. కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో రూ. 5 వేలు పింఛన్ వచ్చేది. నేను నడవడానికి వీలు లేకపోవడం వలన ఏ పని చేయలేను. ఆ డబ్బుతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. ఈ రోజు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి రూ. 15 వేలు పింఛన్ అందచేశారు. ఇక నుంచి ప్రతి నెలా నాకు రూ. 15 వేలు పింఛన్ వస్తుంది. ఇప్పుడు నా కుటుంబ పోషణకు ఎటువంటి ఇబ్బంది లేదు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు చంద్రబాబునాయుడు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

- జానకి రామయ్య, దివ్యాంగుడు, రాప్తాడు